క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కడియం అరుంధతీ పేటలో తాతపూడి శ్రీరాములుకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ నేపథ్యంలో బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. వారికి బియ్యం, దుప్పట్లు, పప్పు దినుసులు, వంట సామగ్రి, నగదును పార్టీ ఎంపీటీసీ బట్టు స్వప్నదేవి చేతుల మీదుగా అందజేశారు. బాబు మాట్లాడుతూ ఇల్లు పాక్షికంగా కూలిపోవడంతో నిరాశ్రయులైన వృద్ధ దంపతులను తక్షణం ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ మూర్తి, పున్నమ రాజు వీర్రాజు, బత్తిని శ్రీధర్, కొమ్ము సత్తియ్య, కవల వెంకన్న, కేసనపల్లి సురేంద్ర, బొమ్మిరెడ్డి సత్తిబాబు, మైపాల వాసు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో రూ.1.50 కోట్లతో చేపట్టిన ట్రాక్ ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని రైల్వే అడ్వైజరీ కమిటీ మెంబర్లు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్టేషన్ అడ్వైజర్ కమిటీ మెంబర్లు యానాపు ఏసు, పీవీ సుబ్రహ్మణ్యం తదితరులు ఆ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మొదటి ప్లాట్‌ఫాం మూసివేసి చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే విశ్రాంత అధికారి విశ్వనాథ్ శర్మ, చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీరాములు, సీటీఈ టి.చంద్రమౌళి, రైల్వేస్టేషన్లు అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్ - 2 గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవరకొండ రాజు (కోలమూరు), ఎస్‌వీజేవీ వరలక్ష్మి (ధవళేశ్వరం), జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ధవళేశ్వరం జూనియర్ అసిస్టెంట్ మద్దుల వెంకటేష్, ధవళేశ్వరం జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ రఘుదేవపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బంగారు అప్పారావుకు పదోన్నతి లభించింది. వీరిలో వరలక్ష్మి, వెంకటేష్‌లను తూర్పుగోదావరి జిల్లాకు, దేవరకొండ రాజు, బంగారు అప్పారావులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కేటాయించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట సమీపంలోని గోదావరి గట్టు వద్ద టూటౌన్ పోలీసులు సోమవారం 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేతా ప్రసాద్ అనే వ్యక్తి ఈ సారా విక్రయిస్తున్నట్లు తెలిసిందని, అతడు పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: శ్యామల నగర్‌కు చెందిన 35 ఏళ్ల డి.నాగేశ్వరరావు వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. అతడు ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు భార్య ఉమ సోమవారం ప్రకాశం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

ధవళేశ్వరం: దివ్యాంగులను అవమానించిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ డిమాండ్ చేశారు. దివ్యాంగులంటే గౌరవం ఉందంటూనే దివ్యాంగుల సమాజం అంటే హేళనగా ట్వీట్ చేయడం దారుణమన్నారు. ఆమె వ్యాఖ్యలు దివ్యాంగులను కించపరిచేలా ఉన్నాయన్నారు. దివ్యాంగులకు క్షమాపణ చెప్పకుంటే అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

యర్రమోతుకు సన్మానం

ధవళేశ్వరం: ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైన ధవళేశ్వరం గ్రామానికి చెందిన యర్రమోతు ధర్మరాజును సోమవారం ధవళేశ్వరంలో టీఎస్‌టీయూసీ, టీడీపీ , జనసేన నాయకులు సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి

కడియం: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా జేగురుపాడు గ్రామంలోని కొత్తకాలనీలో ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి బి.శిరీష, పంచాయతీ, సచివాలయం సిబ్బందితో ఆయన ముంపు నివారణ చర్యలు చేపట్టారు.

గోదారమ్మ ఉరకలు



పుష్కర ఘాట్‌లో గోదావరి వరద ఉధృతిని పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

- మునుగుతున్న ఘాట్లు
- పునరావాస కేంద్రాలకు బాధితులు
- పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి



పుష్కర ఘాట్‌లో గోదావరి ఉధృతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదారమ్మ ఉరకలెత్తుతోంది. భారీగా చేరిన నీటితో రాజమహేంద్రవరంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఘాట్ల వద్దకు ఎవ్వరూ వెళ్లవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. పుష్కర ఘాట్, చందా సత్రం పునరావాస ప్రాంతాలను నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, ప్రత్యేక అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. గోదావరి వరద ఉధృతిని చూసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలపై బ్రిడ్జిలంకలో నివసిస్తున్న 175 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు.

రాత్రికి రెండో ప్రమాద హెచ్చరిక

కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతి కారణంగా సోమవారం రాత్రికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్న నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది ప్రాంతానికి, ఘాట్లు వద్దకు రావద్దని, సెల్ఫీలు, ఫొటోలను తీయవద్దని ఆదేశించారు. చందా సత్రంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, అక్కడికి వచ్చిన మహిళలతో మాట్లాడారు. పురుషులకు, స్త్రీలకు వేరువేరుగా గదులు ఇవ్వాలని, మరుగుదొడ్లకు కూడా విడిగా కేటాయించాలన్నారు. వరద బాధితులకు వేడి నీటిని, వేడిగా ఉన్న ఆహారం అందించాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ ఏ.చైత్ర వర్షిణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవాణి తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రాలకు లంక గ్రామాల ప్రజలు

గోదావరి మధ్యలోని మూడు లంక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించామని రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి అన్నారు. మత్స్య, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో లంక గ్రామాల్లోని కుటుంబాలను తరలింపు ప్రక్రియ జరిగిందన్నారు. గోదావరి వరద నేపథ్యంలో తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఈ చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని చందా సత్రం, ఆల్కాట్ గార్డెన్స్ లోని మున్సిపల్ కల్యాణ మండపాలలో వీరికి పునరావాసం ఏర్పాటు చేసి, అన్ని వసతులు కల్పించామన్నారు. బ్రిడ్జిలంక, ఎదుర్లమ్మలంక, కేతావారిలంకకు చెందిన సుమారు 180 మందికి ఇప్పటివరకూ పునరావాసం కల్పించినట్టు తెలిపారు. కేతావారిలంక నుంచి ఇంకా కొందరిని తరలిస్తున్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఏటిగట్టు పరిశీలన

కడియం: మండలం పరిధిలో వేమగిరి నుంచి పొట్టిలంక వరకు గల ఏటిగట్టును తహసీల్దార్ బి.రమాదేవి సోమవారం పరిశీలించారు. వరదల సమయంలోనూ కొందరు మత్స్యకారులు గోదావరిలో చేపల వేటాడటాన్ని గుర్తించి, వారిని మత్స్యశాఖాధికారులకు అప్పగించారు. అలాగే ఏటిగట్టు వెంబడి పహారా ఏర్పాటు చేయాలన్నారు.

ముంపు ప్రాంతాలలో పర్యటన

కడియం మండలంలోని ముంపు ప్రాంతాలను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్‌తో కలిసి ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ సోమవారం పరిశీలించారు. కడియం ఆవలో పర్యటించి స్థానిక రైతులతో మాట్లాడారు. ముంపునీరు బయటకు పోయేందుకు మార్గాలను మెరుగు పర్చాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఇతర గ్రామాల్లో కూడా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట నష్టం అంచనాలు వేసి, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ శ్రీనివాసులురెడ్డి, ఏవో కె.ద్వారకాదేవి, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి మత్స్యకార కుటుంబాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి వరద నేపథ్యంలో కేతావారిలంక, ఎదుర్లమ్మలంక, బ్రిడ్జిలంకల నుంచి మత్స్యకార కుటుంబాలను సోమవారం ఇస్కాన్ దోబీఘాట్‌కు తీసుకువచ్చారు. ఇక్కడి నుంచి ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ 71 కుటుంబాలకు చెందిన 207 మంది ఆశ్రయం పొందుతున్నారు. భోజనం, వసతితో పాటు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాగా గోదావరికి వరద పోటెత్తుతోంది. గౌతమీ, సరస్వతీఘాట్ల మెట్ట వరకూ నీరు చేరింది.



ఏటిగట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి



లంక గ్రామాల ప్రజలను తరలిస్తున్న సిబ్బంది



సహాయక చర్యలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు



కడియం ఆవలో పర్యటిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్



పుష్కర ఘాట్ వద్ద గోదావరి వరదను చూస్తున్న సందర్శకులు

విద్యార్థినికి ఉపాధ్యాయుల సాయం



విద్యార్థిని హేమకు సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కడియం: పదో తరగతిలో ప్రతిభ చూపి శ్రీకాకుళం లోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన తాండ్ర హేమ అనే విద్యార్థినికి ఉపాధ్యాయులు సాయం అందజేశారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగరానికి చెందిన తాండ్ర హేమ కడియం ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. పబ్లిక్ పరీక్షల్లో 576 వరకు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈనెల 26 కళాశాలలో చేరనున్న నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలికకు సాయం చేశారు. రూ.15 వేలు, దుస్తులను హెచ్ఎం టి.సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హేమకు చదువు విషయంలో ఎటువంటి అవసరం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎంఎస్ మణికుమార్, ఉపాధ్యాయులు రఫీయుద్దీన్, ప్రసాద్, సువర్ణవేణి, అక్షయ, నాగమణి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో 1421.54 హెక్టార్ల మునక



తొర్రేడులో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు భీమరాజు, సుధీర్

రాజమహేంద్రవరం రూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు, గోదావరి వరద కారణంగా రూరల్ నియోజకవర్గంలో 1421.54 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. అలాగే వంద ఎకరాల్లో ఉద్యాన పంటలు కూడా ముంపునకు గురయ్యాయి. రూరల్ మండలంలోని తొర్రేడు, కాతేరు, కోలమూరు గ్రామాలకు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున జల్ల కాలువ నుంచి నీరు వెనక్కి రావడంతో వరిపొలాలు, ఉద్యాన పంటలు నీట మునిగాయి. అధిక వర్షాలతో బొమ్మూరు, ధవళేశ్వరం, హుకుంపేట గ్రామాల్లోను, కడియం మండలంలో కడియం, వేమగిరి,జేగురుపాడు, మురమండ, కడియపుసావరం, దుళ్ల, మాధవరాయుడు పాలెం, వీరవరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి, ఉద్యాన పంటలకు ముంపు బారిన పడ్డాయి.

అధికారుల పరిశీలన

తొర్రేడులో నీటమునిగిన వరిచేలను వ్యవసాయాధికారి భీమరాజు, ఉద్యాన పంటలను ఉద్యాన అధికారి సుధీర్ పరిశీలించారు. భీమరాజు మాట్లాడుతూ పంట ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైతే, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా + 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్ల రాకుండా లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలన్నారు. పసుపు అరటి, కూరగాయల, ఉద్యాన రైతులు యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కడియం ఉద్యాన అధికారి డి.సుధీర్ సూచించారు. తొరేడులో కూరగాయల పాదులు, అరటితోటలను పరిశీలించారు. పొలంలో నిలిచిన నీటిని సత్వరమే సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలు కూడా చల్లాలన్నారు. నేల ఆరిన తర్వాత రసాయనిక ఎరువులు వేసుకోవాలని తెలిపారు. అరటి తోటలో పూర్తిగా నీటిని తీసివేసిన తర్వాత 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 2-3 సార్లు 25 నుంచి 30 రోజుల కాల వ్యవధిలో వేయాలన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



బ్యాడ్మింటన్ విజేతలతో నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: బ్యాడ్మింటన్‌ను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు రాజమహేంద్రవరం కాస్మో పాలిటిన్ క్లబ్ అధ్యక్షుడు డీవీవీ త్రినాథ్ అన్నారు. స్థానిక రాజమహేంద్రవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం పోలిశెట్టి రామ్మోహన్, రాయపురెడ్డి శివనాగేంద్ర మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 35 జట్లకు డబుల్స్ పోటీలు నిర్వహించారు. బి.సాయి, కె.శ్రీకర్ ప్రథమ, సీహెచ్ శ్రీను, హ్యాపీ వినోద్ ద్వితీయ, ఎస్.అబ్రహం, రవితేజ తృతీయ స్థానాలలో నిలిచారు. విజేతలకు జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కాస్మోక్లబ్ అధ్యక్షుడు డీవీవీ త్రినాథ్, సెక్రటరీ అమ్మిరాజు చేతుల మీదుగా బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

హిందీ గాయకుడు ముఖేష్ జయంత్యుత్సవం



ముఖేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ బాలీవుడ్ గాయకుడు ముఖేష్ చంద్ మాధుర్ 102వ జయంతిని సోమవారం రాత్రి జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ దాదాపు 35 ఏళ్ల పాటు పలు విజయవంతమైన హిందీ చిత్రాలలో మాధుర్ గీతాలను ఆలపించారన్నారు.

విద్యాబోధనలో ఉపకరణాలు కీలకం



కడియం హైస్కూల్లో బోధనోపకరణాల ప్రదర్శన

కడియం: విద్యాబోధనలో ఉపకరణాలు ఎంతో కీలకమని ఎంఈవో ఎంఎస్ మణికుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 29 వరకూ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించిందన్నారు. దానిలో భాగంగా మొదటి రోజు తరగతిలో ఉపాధ్యాయులు ఉపయోగించే బోధనోపకరణాలు, పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులు తయారు చేసిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ పాఠ్యాంశాలకు అనుగుణమైన బోధనాంశాలను సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ తాను సేకరించిన 200 మంది కవులు, రచయితల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సువర్ణవేణి ఫ్లోరెన్స్, పద్మశ్రీ, నాగమణి, లీలావతి, కల్యాణి పాల్గొన్నారు.

స్థానిక వనరులతోనే బోధనా సామగ్రి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వనరులతోనే బోధన అభ్యసన సామగ్రిని తయారు చేసుకుని ప్రదర్శించాలని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ఛాత్రోపాధ్యాయులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా డైట్‌లో ఆమె ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు చేపట్టాల్సిన విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలను డాక్టర్ ఏఎం జయశ్రీ వివరించారు.

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యా వారోత్సవాలు (శిక్షా సప్తాహ్) నిర్వహిస్తోందని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్.నారాయణ పేర్కొన్నారు. అర్బన్ పరిధిలోని పలు ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలను సోమవారం సందర్శించి శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను పరిశీలించారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో తొలి రోజు టీఎల్ఎం ప్రదర్శన మేళా జరిగింది. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట: అధిక వర్షాలపై మండల అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాల దృష్ట్యా ప్రజలకు, పంటలకు, పశువులకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, పంటలు ఏవైనా ముంపునకు గురైతే వెంటనే ఉపాధి హామీ కూలీలతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, ప్రభుత్వ భవనాల వద్ద నిల్వ ఉన్న నీటిను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరదల వల్ల జరిగిన నష్టాన్ని ఆయా శాఖల వారీగా మదింపు చేసి నివేదికలను ఎంపీడీఓ ద్వారా తనకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.రవికుమార్, ఎంపీడీఓ పి.వెంకటరత్నం, మండల అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి తరలిరండి


- ములకల్లంక వాసులను కోరిన తహసీల్దార్
- సున్నితంగా తిరస్కరించిన గ్రామస్తులు



ములకల్లంకలో మహిళతో మాట్లాడుతున్న తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు

సీతానగరం: గోదావరి మధ్యలో ములకల్లంక గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని, అక్కడకు తరలిరావాలని ములకల్లంక వాసులను అధికారులు కోరుతున్నారు. కానీ ఆ గ్రామస్తులు మాత్రం సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సోమవారం ఆ గ్రామంలో తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి. బాలశంకరరావు, డీఈ రవి, ఏఈ అవినాష్ పర్యటించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని, లేదా మీ బంధువులు ఉంటే వారి ఇళ్లకు వెళ్లవచ్చని ప్రజలకు సూచించారు. గోదావరి వరద మరింత ఎక్కువ అవుతుందని హెచ్చరించారు. కాగా... డ్యూటీ డీఎంహెచ్‌వో ఎం.శ్రీహరిబాబు బొబ్బిల్లంకలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. బొబ్బిల్లంక రేవును బీజేపీ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి సందర్శించి ఏటిగట్టు పలు ప్రాంతాల్లో బలహీనంగా ఉందని, ఇరిగేషన్, ఏజీఎల్‌బి శాఖాధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు.

సినిమాలు



శ్యామల	:	భారతీయుడు-2
సూర్యమినీ	:	బ్యాడ్‌న్యూస్
సూర్యప్యాలెస్	:	భారతీయుడు-2
స్వామి	:	ట్విస్టర్స్
అశోక	:	కల్కి2898ఏడీ
శివజ్యోతి	:	పేకమేడలు
అనుశ్రీ	:	డార్లింగ్
రంభ	:	క్రైమ్ రియల్
ఊర్వశి	:	డీమోంటీ కాలనీ
కుమారి	:	నరబలి
అప్సర	:	కల్కి2898ఏడీ
నామవరం		
వీఎస్ మహల్	:	డార్లింగ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కల్కి2898ఏడీ
కడియం		
వెంకటసూర్య	:	డార్లింగ్

శాకంబరి అలంకరణలో దుర్గాదేవి



పెదపూడి: అనపర్తిలోని మార్కండేయపురం భావన రుషి ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రాము శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కానూరు కృష్ణ అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.